ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 16 సంచిక : 09 మే 2011

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు ~ 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

కైకలూరు ........ 17-02-2011

పోడూరు ........ 31-03-2011

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 17-02-2011, కైకలూరు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు రామకృష్ణుడి జయంతి. గయ చాలామంది వెళుతున్నారు. గయలో ఒక విష్ణుమూర్తి గుడి ఉంది. ఆయనను గదాధరుడు అని అంటారు. అది తెలియక చాలామంది ఆయనను చూడకుండా వచ్చేస్తున్నారు. రామకృష్ణుడి తండ్రి ఒకసారి తీర్థయాత్రలకు వెళ్ళి పగలు అన్నీ చూసి రాత్రి ఆ గుడిలో నిద్రపోయాడు. రామకృష్ణుడి తండ్రికి స్వప్నంలో గదాధరుడు కనిపించి నేను మీ ఇంటికి వస్తాను అని చెప్పాడు. రామకృష్ణుడి తండ్రి ఏమన్నాడు అంటే మీరు మా ఇంటికి రావద్దు. నేను పేదవాడిని, ఏదో ఒక గుడిసెలో బతుకుతున్నాను, నిన్ను నేను పోషించలేను, నీకు భోజనం పెట్టటం కూడా నాకు కష్టం అందుచేత మా ఇంటికి రావద్దు అని చెప్పాడు. రామకృష్ణుడి తండ్రి పరమపవిత్రుడు. నీలో ఉన్న పవిత్రత వలన నేను మీ ఇంటిలో జన్మిస్తాను, ఎవడో బాగా అన్నం పెడతాడని నేను ధనవంతుల ఇంటికి వెళ్ళను, నేను మీ ఇంటికే వస్తాను అని గదాధరుడు చెప్పాడు. ఈయన రావద్దు అని చెప్పినా ఆయన వచ్చేసాడు, వాడే రామకృష్ణుడు. పొట్టకోసం మనం పని చేసుకొంటాము. మహర్షులు, మహాత్ములు కూడా పని చేస్తారు అయితే వారి పొట్టకోసం కాదు, ప్రజలకు ఉపయోగపడే సంస్థలను అభివృద్ధి చేయటంకోసం వారు పనిచేస్తారు.

దేహప్రారబ్ధాన్ని అనుసరించి రామకృష్ణుడికి పెళ్ళి అవ్వటం ఆలస్యం అయ్యింది. రాణి రాసమణి దక్షిణేశ్వరం ప్రాంతాన్ని పరిపాలించేది. రామకృష్ణుడు ఏ గుడిలో అయితే అర్చకుడిగా పనిచేసాడో ఆ గుడిని

ఆవిడే కట్టించింది. రాణి రాసమణికి కాశీలో దుర్గ గుడి కట్టించాలని ఉండేది. ఒకరోజు దుర్గమ్మ ఆవిడకు కలలో కనిపించి నువ్వు కాశీ వెళ్ళటం ఎందుకు ఇక్కడ గంగానది ఒడ్డున నా గుడి కట్టించమని చెపితే అప్పుడు రాసమణి దక్షిణేశ్వరంలో దుర్గగుడి కట్టించింది. రామకృష్ణుడి అన్నగారికి రాసమణితో పరిచయం ఉండేది. మా తమ్ముడికి ఉద్యోగం లేదు, మీరు ఉద్యోగం ఇప్పించాలి అని ఆయన రాసమణిని అడిగితే నెలకు 8 రూపాయల జీతం మీద దక్షిణేశ్వరం కాళీ గుడిలో ఆయనకు ఉద్యోగం ఇచ్చారు. ఈయనచేత ఉద్యోగం చేయించాలి అని అన్నగారి ఉద్దేశంకాదు, ఏదో ఉద్యోగం చేస్తూ ఉంటే ఎవడో ఒకడు పిల్లను ఇస్తాడు, పెళ్ళి అయిపోతుంది అని ఆయన ఉద్దేశం. నీకు ఉద్యోగం ఇచ్చినా ఇంకా పెళ్ళి అవ్వటం లేదు అని అన్నగారు అంటూ ఉండేవాడు. ఏ అమ్మాయిని ఇచ్చి నాకు పెళ్ళి చెయ్యరో వారి ఇంటికి వెళ్ళి నాకు పెళ్ళిచెయ్యమని మీరు అడుగుతున్నారు. అలాకాదు జయరామ్‌భాటిలో ఫలానా వారి అమ్మాయి ఉంది నువ్వు వెళ్ళి తల్లితండ్రులను అడిగితే వారు ఒప్పకుంటారు, పెళ్ళి అయిపోతుంది అని రామకృష్ణుడు చెప్పాడు. రామకృష్ణుడి అన్నగారు అక్కడికి వెళ్ళి అమ్మాయిని చూసాడు. ఆ అమ్మాయి చిన్నపిల్ల, రామకృష్ణుడికి అప్పటికే సుమారుగా 24 సంIIలు వచ్చాయి. ఈ సంబంధం ఎలా కుదురుతుంది, మనం అడగటం పొరపాటు అనుకొన్నాడు, అయినా రామకృష్ణుడు అడగమన్నాడు కదా అని ఆయన అడిగితే అమ్మాయి తల్లితండ్రులు ఒప్పకున్నారు. ఈశ్వరుడికి ఈ సృష్టిలో అసాధ్యం అంటూ ఏమీ లేదు, అన్నీ సాధ్యమే.

రామకృష్ణుడి గురించి ఆయన భక్తులు చదివే ముఖ్యమైన గ్రంధాలు రెండు 1. రామకృష్ణ ది గ్రేట్ మాస్టర్, అది శారదానంద వ్రాసాడు. 2. గోస్పెల్ ఆఫ్ శ్రీరామకృష్ణ అది మహేంద్రనాథ్ గుప్త వ్రాసాడు. మహేంద్రనాధ్ గుప్త మొట్టమొదట రామకృష్ణుడిని చూసాక తరచుగా రావటం మొదలుపెట్టాడు. సెలవు ఇచ్చేటప్పటికి వచ్చేసి రామకృష్ణుడిని ఎంజాయ్ చెయ్యటం మొదలుపెట్టాడు. ఏమిటి వీడు తరచుగా వచ్చేస్తున్నాడు అనేవారు రామకృష్ణుడు. మహేంద్రనాథ్‌గుప్తకు డైరీ వ్రాసుకునే అలవాటు ఉంది. రామకృష్ణుడి దగ్గరకు వచ్చినప్పడు కూడా ఏరోజుకారోజు డైరీ వ్రాసుకునేవాడు. పుస్తకం ప్రింటు చేద్దామనికాదు ఇంటి దగ్గర చదువుకోవటంకోసం వ్రాసుకొనేవాడు. రామకృష్ణుడు కూడా వద్దని చెప్పేవాడుకాదు. అంతకుముందు ఇంటిదగ్గర ఏదైనా కష్టం వస్తే ఆయనకు చనిపోవాలనే బుద్ధి వచ్చేది. రామకృష్ణుడి దగ్గరకు వచ్చాక ఆయన అనుగ్రహం వలన చనిపోవాలనే బుద్ధిపోయింది, ఏవైనా కష్టాలు వచ్చినా భరించటం అలవాటు అయ్యింది. ఆయన వ్రాసుకొన్న డైరీ ఇంటికి

వెళ్ళిన తరువాత చదువుకొని ఆ మాటలను ఎంజాయ్ చేసేవాడు. ఆయన వ్రాసుకొన్న వాక్యాలలో ఒక వాక్యం చెపుతాను. నేను గురించి ఉపనిషత్‌లలో కూడా చెప్పారు. ఎవడో ఒక భక్తుడు నేను ఎలా పోతుంది అని అడిగితే ఈ చదువురాని పూజారి, ఎక్కడో పల్లెటూరిలో పుట్టి పెరిగిన పూజారి చెప్పిన సమాధానం ఎంత వండర్‌ఫుల్‌గా ఉందో చూడండి. నేను ఎలా పోతుంది అని అడిగితే రామకృష్ణుడు అంటాడు ఇప్పుడు నువ్వు ఎలా జీవిస్తున్నావు అని అడిగాడు, నేనుగా జీవిస్తున్నాను అని ఆ భక్తుడు చెప్పాడు. నువ్వు నేనుగా బతుకుతున్నావు కదా నువ్వు నేనుగా బతుకుతున్నంతకాలం ఆ నేను ఎలా పోతుంది, ఆ నేను పోదు. నువ్వు నేనుగా బతకటం మానేస్తే అప్పుడు ఆ నేను పోతుంది అన్నాడు. ఎంత అందంగా చెప్పాడో చూడండి. పుస్తకాలు చదవటం వేరు, గురువు చెపుతూ ఉంటే శ్రవణం చేయటం వేరు. ఆయన ఏదైతే చెపుతున్నాడో అది దర్శించి చెపుతున్నాడు కాబట్టి ఇంత అందంగా చెప్పాడు.

రామకృష్ణుడికి మానవజాతి మీద విపరీతమైన ప్రేమ. అది బిజినెస్ లవ్ కాదు. ఏమీ ప్రతిఫలం కాంక్షించకుండా కేవలం ప్రేమ ప్రేమకోసమే ఆయన టీచింగ్ చెప్పాడు. ఏ స్థితిని అయితే ఆయన పొందాడో ఆ స్థితికి నిన్ను తీసుకొని వెళ్ళటానికే ఆయన చెప్పాడు కాని అక్కడ మరొక ఉద్దేశం లేదు. మొట్టమొదటలో ఆయన దగ్గరకు ఎక్కువ మంది సంసారులు వచ్చేవారు. ఏమిటి ఎక్కువ మంది సంసారులే వస్తున్నారు. వీరు నానిపోయిన అగ్గిపుల్లలులాంటివారు. మనం చెప్పేది వారికి తొందరగా అర్థంకాదు. అందుచేత బ్యాచులర్స్‌ను పంపించు, వారు తొందరగా గ్రహిస్తారు, అభివృద్ధిలోనికి వస్తారు అని కాళీమాతను ప్రార్థించేవాడు రామకృష్ణుడు. మైడియర్ బాయిస్ వచ్చేయండిరా, వచ్చేయండి అనేవాడు. టైము రాకుండా ఎలా వస్తారు. ముందు సంసారులను మోయటం నేర్చుకోవయ్యా, వారు చదువుకొంటున్నారు కొద్దికాలంలో నీ దగ్గరకు వస్తారు అని మాత చెప్పేది. తరువాత ఆయన దగ్గరకు 16 మంది కుర్రాళ్ళు వచ్చారు, ఆయన శిష్యులయ్యారు, అందులో ముఖ్యుడు నరేంద్రుడు. రామకృష్ణుడు గురువేకాదు గురువులను తయారుచేసిన గురువు. అందుచేత ఆయన అనంతరం కూడా టీచింగు ఆగలేదు, తరువాత ఆ 16మంది సన్యాసం తీసుకున్నారు. బుల్లి నరేంద్రుడు రామకృష్ణుడిని చూడటానికి దక్షిణేశ్వరం వెళ్ళలేదు. నరేంద్రుడి ప్రక్కఇంటివారు ఈ రోజు మా ఇంటికి రామకృష్ణుడిని తీసుకొనివస్తున్నాము, చూడటానికి రా అని పిలిస్తే అక్కడకు వెళ్ళాడు. అప్పుడు రామకృష్ణుడు నరేంద్రుడిని చూసి వీడు వాడంతట వాడు రాలేదు, మనం రమ్మంటే వచ్చిన కుర్రాడు అని గుర్తించి ఆయన లేచి నువ్వు దక్షిణేశ్వరం వస్తూ ఉండు అని నరేంద్రుడితో చెప్పాడు. నరేంద్రుడు రావటం ఆలస్యమయితే ఎవరితో

అయినా కబురు పంపించేవాడు. అలాగే 16 మంది శిష్యులు వచ్చారు. వారికి ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం ఎలా సాధించాలి, తపస్సు ఎలా చెయ్యాలి ఇవి అన్నీ చెప్పాడు. ఒకవేళ మహిమలు వస్తే, ఏవైనా శక్తులు వస్తే వాటికి ఆకర్షింపబడకూడదు, జ్ఞానాన్ని విడిచి పెట్టేసి, ప్రజలను బాగుచేయటం మానేసి వాటికూడా తిరగకూడదు అని ఇవి అన్నీ బోధించి వారిని గురువులుగా తయారుచేసాడు.

రామకృష్ణుడికి చివరి రోజులలో కంఠంలో కేన్సర్ వచ్చింది, మజ్జిగ కూడా లోపలకు వెళ్ళటంలేదు. అప్పుడు శిష్యులు అంటారు ఓ రామకృష్ణదేవా! మేము ఇంతమంది శిష్యులం ఉండి కనీసం నీకు మజ్జిగ కూడా ఇవ్వలేకపోతున్నాము అని బాధపడతారు. అప్పుడు రామకృష్ణుడు అంటాడు ఓ నరేన్! ఈ నోరే తినాలా, ప్రపంచంలో ఎన్ని నోర్లు ఉన్నాయి, ఆ నోర్లు ద్వారా తినేవాడిని నేనే కదా. ఈ నోరు తింటేనే నేను తిన్నట్లు లేకపోతే నేను తినటం లేదా. అంటే అక్కడ ఉన్నది దేహగతమైన నేను కాదు, అది యూనివర్సల్ ఐ, అది నిజమైన నేను. లోపలఉన్న తత్వం వాక్కుకు అందదు, మనస్సుకు అందదు, బుద్ధికి అందదు అని శాస్త్రంలో ఉన్న మాటలు ఆయన దగ్గర చెప్పేవారు. ఇవన్నీ చిలుకపలుకులు అని ఆయనకు తెలుసు. మనస్సుకు అందదా ఎక్కడ చదివావు నువ్వు. అపవిత్రమైన మనస్సుకు అందదు. పవిత్రమైన మనస్సుకు అందకుండా ఎక్కడికి పోతుంది. నీకు అర్హత లేనప్పుడు యోగ్యత లేనప్పుడు నారాయణుడు నీకు అందడు. నీ బుద్ధిలో దోషాలు ఉంటే, నీ మనస్సులో దోషాలు ఉంటే ఆయన నీకు అందడు కాని పరమపవిత్రుడికి కూడా వాడు అందకుండా పోతాడా? అలా అందకపోతే వాడు భగవంతుడు ఎలా అవుతాడు అన్నారు. రామకృష్ణుడి ధర్మపత్ని శారదకి కొంతమంది భక్తులు ఉండేవారు. ఏమండి రామకృష్ణుడి భక్తులు చాలా అభివృద్ధిలోనికి వచ్చినట్లు కనబడుతున్నారు, మీకు భక్తులు ఉన్నారు వారు పెద్ద అభివృద్ధిలోనికి వచ్చినట్లు కనబడటం లేదు అని శారదామాతను ఒకరు అడిగారు. ఆయన ఏనుగులను లాగేసి చీమలను నాకు వదిలేసాడు అంటే డిజర్వు అయిన వారిని తీసేసుకొని మిగతా వారిని నాకు వదిలేసాడు. అయినా నేను వారిని విడిచిపెట్టటం లేదు. వారికి బాగుపడే టైము వస్తుంది, తప్పక అభివృద్ధిలోనికి వస్తారు అని చెప్పింది. అది తల్లి ప్రేమ.

పుస్తకాలు చదవటం వలన, బాహ్యప్రక్రియల వలన మీకు జ్ఞానం రాదు. ఏవో మంచి పనులు చేసినంత మాత్రంచేత మీకు జ్ఞానం రాదు. మనలో ఉన్న అజ్ఞానం పోవాలి. పరమేశ్వరుని దయవలన మీలో ఉన్న అజ్ఞానం పోవాలి కాని ఏవో బజారులో మందులు

కొనుక్కొని ఈ అజ్ఞానాన్ని పోగొట్టుకోలేము. పరమేశ్వరుని దయ అనే మందు నీకు దొరకకపోతే ఈ అజ్ఞానం బయటకు పోదు. త్యాగబుద్ధి లేని వాడికి గీత ఎన్నిసార్లు చదివినా అది అర్థంకాదు అని రామకృష్ణుడు చెప్పాడు. చదవటం వలన నీకు శబ్దానికి అర్థం తెలియవచ్చు కాని మీకు త్యాగబుద్ధి లేకపోతే గీత దాని హృదయాన్ని మీకు ఇవ్వదు అని చెప్పాడు. రామకృష్ణ మఠ్ ఎలా ప్రారంభమయ్యింది అంటే రామకృష్ణుడు కాశీపూర్ గార్డెన్‌లో ఉండగా ఒక భక్తుడు కాషాయబట్టలు తెచ్చి ఆయనకు ఇచ్చి మీ చేతితో సన్యాసులకు ఒకో బట్ట ఇవ్వండి అని చెప్పాడు. ఇక్కడ మా పిల్లలు ఉన్నారు, వీరికంటే పెద్ద సన్యాసులు ఈ నగరంలో ఉన్నారా అన్నాడు. అంతకుముందు వారికి పెళ్ళిళ్ళు అవ్వలేదు గాని తెల్లబట్టలు కట్టుకొని తిరిగేవారు. వారు ఇంట్లో ఉన్నా లేకపోయినా, వారు తెల్లబట్టలు కట్టుకొన్నా త్యాగబుద్ధి కలవాడు సన్యాసి. మా పిల్లలకంటే త్యాగబుద్ధికలవారు ఈ నగరంలో ఉన్నారా అంటూ ఈ కాషాయబట్టలను 16 మందికి పంచిపెట్టేసాడు. మనం సన్యాసులం అవుతాము అనివారు అనుకోలేదు, గురువుగారు ఇచ్చారు అని ఆ బట్టలు కట్టేసుకున్నారు. తరువాత వారు ఇళ్ళకు వెళితే మీరు ఇంటికి రావద్దు అని ఇంట్లో వారు చెప్పారు ఎందుచేతనంటే సన్యాసం పుచ్చుకుంటే ఇంట్లో వారికి బాధగా ఉంటుంది కదా. అలా రామకృష్ణమిషన్ ఆయన ఉండగానే ప్రారంభమయ్యింది. తరువాత వివేకానందుడు వారు ఆ చెట్టును పెంచారుగాని బీజం రామకృష్ణుడే వేసాడు.

రామకృష్ణుడు ఇంక రెండు రోజులకు శరీరం విడిచిపెడతాడు అనగా నరేన్‌ను దగ్గరకు పిలిచి నువ్వు ఈ ప్రపంచానికి బోధించడానికే పుట్టావు అన్నాడు. అప్పుడు నరేంద్రుడు అంటాడు నాకు ఈ బోధలగొడవ, రచనల గొడవ ఇవి ఏమీ వద్దు, నేను తరిస్తే సరిపోతుంది అంటాడు. సహజంగానే ఆయనకు వైరాగ్యం ఉంది. రామకృష్ణుడు ఉండగానే సన్యాసం తీసుకొని ఇల్లు విడిచిపెట్టి వెళ్ళిపోదాము అని చూసాడు. అది రామకృష్ణుడికి తెలిసి నరేంద్రుడికి కబురు పంపించి నువ్వు సన్యాసం తీసుకోవాలి అంటే తీసుకొందువుగాని నా శరీరం చనిపోయేవరకు నువ్వు నన్ను విడిచిపెట్టి బయటకు వెళ్ళకు నరేన్ అని చెప్పాడు. అప్పుడు నరేన్ ఉండిపోయాడు. నువ్వు వరల్డ్‌కు టీచ్ చేస్తావు అని రామకృష్ణుడు అంటే నాకు ఆ ఉద్దేశం లేదు అంటాడు నరేన్. దేవతల ప్రీత్యర్థం యజ్ఞాలు, యాగాలు చేసి అందులో నెయ్యి వేస్తున్నారు, ఈ చిన్న నేనును, దేహగతమైననేనును అగ్నిహోత్రంలో పడేద్దామని నేను చూస్తున్నాను, నేను చేసే యజ్ఞం అదే రామకృష్ణదేవా అంటాడు. ఈ నేను ఉంటే దేవతల గొడవ, లోకాల గొడవ, పుణ్యపాపాల గొడవ అంతా ఉంది, ఈ నేను లేనివాడికి ఏ గొడవలేదు.

అందుచేత ఈ నేనును హోమంలో పడేస్తాను, నెయ్యి ఎలా తగులబడిపోతోందో, ఈ నేను కూడా అలా తగులబడిపోతుంది. దీనిని వదిలించుకోవటం తప్ప లోకంలో ఏవో గొప్పలు పొందాలని నాకు లేదు అని చెప్పాడు. నరేన్ నువ్వు నా పనికోసం ఈ భూమి మీదకు వచ్చావు. నేను తరిస్తే సరిపోతుంది అంటున్నావు అంటే నువ్వు అంత చిన్నవాడివా, అంత కురచగా ఆలోచిస్తున్నావా. నేను బోధించను అంటున్నావు. నువ్వు బోధించటం మానెయ్యి. నీ ఎముకలు ఈ ప్రపంచం అంతా తిరిగి బోధిస్తాయి. ఈ పిల్లలను జాగ్రత్తగా చూసుకో. వారి ఇంటి దగ్గర అందరూ కోపంగా ఉన్నారు, వీరిని ఇంటికి రానివ్వరు. వారు ఎక్కడికి చెదరిపోకుండా, వారికి తిండికి బట్టకు లోటు లేకుండా నువ్వు జాగ్రత్తగా చూసుకో అని చెప్పాడు.

రామకృష్ణుడు శరీరం విడిచిపెట్టాక వారు ఉండే ఇంటికి ఎవడైతే అద్దె కట్టేవాడో వాడు అద్దె కట్టటం మానేసాడు. ఎలాగు గురువుగారు వెళ్ళిపోయారు అని అద్దె కట్టటం మానేసాడు. అప్పడు రామకృష్ణుడు వాడికి స్వప్నంలో కనిపించి వారికి నాకు తేడా ఏముంది, నీకు సమర్థత ఉంది, ఎందుకు అద్దె చెల్లించటం మానేసావు, ఒక సంవత్సరం అద్దె చెల్లించు, తరువాత వారూ చాలా పెద్దవారు అయిపోతారు, తరువాత నీ అవసరం వారికి ఉండదు అని చెప్పాడు. అలాగే ఒక సంవత్సరం వాడు అద్దె కట్టాడు. తరువాత వీరు దేశపర్యటనకు బయలు దేరారు. స్వామీజీ దేశం అంతా తిరిగి దేశంలో ఉన్న దారిద్ర్యం చూసాడు. మనం దేశంకోసం పనిచెయ్యాలి, దేశంలో ఉన్న దారిద్ర్యం పోగొట్టాలి అనుకొన్నాడు. అప్పడు వరల్డ్ రెలిజియన్స్ కాంగ్రెస్ షికాగోలో జరిగింది. దానికి వెళ్ళాలా వద్దా అని ఆలోచిస్తున్నాడు. మీరు వెళ్ళి మన మతం గురించి రిప్రజెంట్ చేయాలి అని మద్రాసులో ఆయనను ప్రోత్సహించారు. అప్పడు రామకృష్ణుడు స్వప్నంలో కనిపించి నువ్వు అమెరికా వెళ్ళు, నీకు మార్గం క్లియర్ చేస్తున్నాను అని చెప్పాడు.

నేను ఈ ప్రపంచాన్ని స్వప్నంలో కూడా ఎప్పడూ ఎంజాయ్ చెయ్యలేదు అన్నాడు రామకృష్ణుడు. జాగ్రదవస్థలోకాదు, స్వప్నంలో కూడా నేను ఈ లోకాన్ని ఎంజాయ్ చెయ్యలేదు అన్నాడు. వాడు రామకృష్ణుడు. భగవంతుడు 26 లక్షణాలు చెప్పాడు. దైవీసంపద అని ఈ లక్షణాల గురించి నేను పూర్వం చెప్పాను. దైవీసంపద పుస్తకం దొరికితే చదవండి. ఆ గ్రేట్ క్వాలిటీస్ మీకు ఉంటే జ్ఞానం దగ్గరకు మీరు వెళ్ళనక్కరలేదు, జ్ఞానం వచ్చి మిమ్మల్ని వరిస్తుంది. ఈ దైవీగుణాలు లేకుండా దైవదర్శనం లభ్యంకాదు. అచాపలమ్ అంటే చపలత్వం లేకుండా

ఉండటం. కొంతమంది అక్కరలేని పనులన్నీ చేస్తూ ఉంటారు, అక్కరలేని మాటలు మాట్లాడతారు. దీనికి మనస్సులో ఉన్న చపలత్వం కారణం. వారు చేసే పనులు వారికి ఉపయోగపడవు, సమాజానికి ఉపయోగపడవు. చివరకు సమాజానికి బరువు కింద తయారవుతారు. అందుచేత మనస్సులో చాపల్యం లేకుండా మీరు చూసుకోవాలి. అభయం అంటే భయం లేకుండా ఉండటం మీరు ఏ మాట మాట్లాడినా, ఏ పని చేసినా భయం లేకుండా చెయ్యటం నేర్చుకోండి. బీ ఫియర్ లెస్ అని వివేకానంద చెప్పేవాడు. భయం లేకుండా ఉండమన్నాడు అంటే అక్కడ మొండితనంగా ఉండమని కాదు, మీరు ఇతరులను భయపెట్టకండి, మీరు ఇతరులకు భయపడకండి. మీరు ఈ లోకంలో ఎక్కడికి వెళ్ళి చూసినా రాగద్వేషములు తప్పించి ఏమీ లేదు అన్నాడు బుద్ధుడు మీకు రాగద్వేషాలు లేవు అనుకోండి అంటే మీకు ఎక్కడా ఇష్టం, అయిష్టం లేవు అనుకోండి ఇంక మీ మనస్సును కదలమన్నా కదలదు. ప్రతీ చిన్న విషయానికి మీరు భయపడుతూ ఉంటే మీకు దుఃఖం, అశాంతి వచ్చి తీరుతుంది. అందుచేత భయం లేకుండా ఉండటం నేర్చుకోండి.

రామకృష్ణుడు బోధస్వరూపుడు, కరుణాస్వరూపుడు, దయాస్వరూపుడు, ప్రేమ స్వరూపుడు. ఆయన చివరిరోజులలో నువ్వు అలా చెయ్యి, నువ్వు ఇలా చెయ్యి అని శిష్యులకు బోధిస్తున్నాడు. అప్పుడు శారదామాత వెళ్ళి నామాట ఏమిటి అంది. నేను శరీరం విడిచిపెట్టాక నువ్వు కలకత్తాలో ఉండవద్దు. వెళితే మా ఇంటికి వెళ్ళు లేకపోతే పుట్టింటికి వెళ్ళి జయరామ్‌భాటీలో ఉండు అని చెప్పాడు. అలాగే శారదామాత పుట్టింటికి వెళ్ళిపోయింది. తరువాత కొంతకాలానికి శిష్యులు చాలా పెద్దవాళ్ళు అయిపోయారు, వారికి స్పిరిట్యువల్ స్టేటస్ వచ్చేసింది. బేలూర్‌మఠ్ అంతా పెద్ద పెద్ద డాబాలు కట్టేసారు. శారదానందకు శారదామాత అంటే చాలా ఇష్టం. ఆయన జయరామ్‌భాటి వెళ్ళి శారదామాతను మీరు కలకత్తా వచ్చేయండి అని అడుగుతాడు. గురుదేవుడు నన్ను ఉంటే అత్తవారి ఇంటివద్ద, లేకపోతే పుట్టింటి వద్ద ఉండమని చెప్పారు అందువలన నేను కలకత్తా రాను అని చెప్పింది. అక్కడ ఒక తాటాకుపాకలో శారదామాత ఉంటోంది. అప్పుడు శారదానంద అంటాడు మేము అక్కడ డాబాలలో ఉంటూ, అందరిచేత గౌరవింపబడుతూ సుఖంగా ఉంటే మీరు ఇక్కడ తాటాకుపాకలో ఉంటే నాకు నిద్ర ఎలా పడుతుంది అని అడిగాడు. అప్పటి పరిస్థితులను బట్టి గురుదేవులు అలా చెప్పారు. మీరు కలకత్తా వచ్చేవరకు నేను ఇక్కడ నుండి కదలను అని అక్కడే నాలుగు రోజులు ఉండి శారదామాతను తీసుకొని వచ్చేసాడు. శారదామాతను పట్నం తీసుకొని వచ్చాక ఆవిడకు ప్రత్యేకంగా ఒక డాబా కట్టి మాతను

అందులో ఉంచి మధ్యాహ్నం టైములో శారదానంద కాపలా ఉండేవాడు. శారదామాతకు కూడా శారదానంద అంటే బాగా ఇష్టం. ఎంత ఇష్టం అంటే నా శరీరం మరణించాక దానిని చితిమీద పెట్టాక ఆ చితికి నువ్వే నిప్ప పెట్టు అని శారదానందకు చెప్పింది. తమ్ముళ్ళతో ఏమని చెప్పింది అంటే నా మరణవార్త విన్నాక మీరు నన్ను చూడటానికి రావచ్చు కాని కార్యక్రమాలు అన్నీ శారదానంద చేస్తాడు అని చెప్పింది. అలాగే కార్యక్రమాలు అన్నీ శారదానంద చేసాడు. అప్పడు శారదానంద రామకృష్ణమఠ్ సెక్రటరీగా ఉండేవాడు. గంగానది ఒడ్డున మాతకు సమాధి కట్టించాడు.

రామకృష్ణుడు అంటూ ఉండేవాడు మీరు వంద మందికి ఉపకారాలు చేయలేక పోవచ్చు, సహాయం చేయలేకపోవచ్చు. వందమందికి మనం సహాయం చేయలేమని కనీసం ఒకరికయినా సహాయం చేయటం మానకండి. యిట్ ఈజ్ గ్లోరియస్ ఈవెన్ టు హెల్ప్ వన్‌మేన్. ఓ నరేన్ నీకోసం నేను భిక్ష చేయటానికి కూడా నాకు అభ్యంతరం లేదు. నీకు ఇంటి దగ్గర ఏమయినా ఇబ్బందులు ఉంటే అమ్మతో చెప్ప, వెళ్ళి అమ్మని ప్రార్థించు అనేవాడు రామకృష్ణుడు. నరేన్ ఏమని చెప్పాడు అంటే అన్నంకోసమా అమ్మని అడిగేది. మీరు అడగమంటే జ్ఞానం అడుగుతాను, వైరాగ్యం అడుగుతాను. అన్నం లేకపోతే కడుపు కాలి చస్తానుకాని దేవుడి దగ్గరకు వెళ్ళి నాకు అన్నంపెట్టు అని అడగను అని చెప్పేవాడు. సరే నువ్వు అడగకపోతే మానెయ్యి నీకోసం నేను అడుగుతాను అన్నాడు రామకృష్ణుడు. అంటే అది సంభాషణకాదు, వేదాంతం కూడా కాదు. అది అలౌకికమైన ప్రేమ. వివేకానంద అమెరికా నుండి తిరిగి వచ్చాక ఆయన దగ్గరకు దొరలు, బాగా చదువుకొన్నవారు ఎక్కువగా వచ్చేవారు. మనకు చదువులేదు ఈ పెద్దవాళ్ళతో మనకు ఎందుకు అని అద్భుతానంద వీరికి దూరంగా ఉండేవాడు. అద్భుతానంద పేరు పెట్టక ముందు ఆయన పేరు లాటు. అలా దూరంగా ఉంటే వివేకానంద పిలిచాడు. ఏమిటి నువ్వు దూరంగా తిరుగుతున్నావు. నేను అమెరికా వెళ్ళి వస్తే పెద్దవాడిని అయిపోయానా, చదువుకొంటే పెద్దవాడిని అయిపోయానా? ఇప్పడు ఏమి వచ్చిందని నువ్వు దూరంగా ఉంటున్నావు. నువ్వు నాకు అద్భుతానందవు కాదు, నేను నీకు వివేకానందను కాదు. ఆ పేర్లు వదిలేయి అని చెపుతూ ఇక్కడ అంటాడు ఓ లాటూ! యు ఆర్ మై లాటూ, అయామ్ యువర్ నరేన్ అంటాడు. ఆ ప్రేమ పూరిత మాటలను మనం భరించలేము.

రామకృష్ణుడు వాసనల గురించి మాట్లాడటమేకాదు, ఆ వాసనలను సర్జరీ చేసి

తీసేసేవాడు. ఆ వాసనలను తొలగించకపోతే వాటితో బాధపడుతూ నా పని మీరు చెయ్యగలరా? చెయ్యలేరు కాబట్టి సర్జరీ చేసి వాటిని లాగేసేవాడు. నీ బంధాలను తొలగిస్తాను అంటే వాటిని లాగిపడేయటమే అంటే ఆ శక్తి వారికి ఎక్కడ నుండి వచ్చింది అంటే త్రికరణ శుద్ధి వలన ఆ శక్తి వస్తుంది. ఏమిటి ఈ హెడ్‌మాష్టారు రోజూ వచ్చేస్తున్నారు, ఏమయినా రుచి మరిగారా అని అడిగాడు. అలా మాట్లాడకూడదు అని కూడా ఆయనకు ఉండదు. అసలు కపటం అంటే ఏమిటో ఆయనకు తెలియదు. కుటుంబ పరిస్థితులు బాగాలేక నరేంద్రుడు ఇబ్బంది పడేవాడు. వివేకానందుడు ఇబ్బంది పడుతున్నాడు అని చెపితే ఫరవాలేదు. ఏమిటి ఈ బుల్లి నరేంద్రుడు పప్పులో ఉప్పు వేసుకోలేకపోతున్నాడా అనేవారు. అంటే పప్పులో వేసుకోవటానికి వీడికి ఉప్పు కూడా లేదు అని. ఇక్కడ తెలుసుకోవలసింది ఏమిటి అంటే అసలు కపటంగా మాట్లాడటం అనేది ఎలా ఉంటుందో ఆయనకు తెలియదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 31-03-2011, పోడూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

యుద్ధం అంటే ఎక్కడో కురుక్షేత్ర యుద్ధం జరిగింది అని మీరు అలా అనుకోవద్దు. మన సంసారం కూడా యుద్ధభూమే. ప్రతీ కుటుంబంలోను పేచీలు ఉంటాయి. ఇంట్లో నలుగురు మనుషులు ఉంటే అందరూ ఒకరకంగా ఉండరు. వారి పూర్వజన్మలు వేరు, వారి వాసనలు వేరు, ఎక్కడ నుండో ఎక్కడ నుండో ఆ ప్రారబ్ధాన్ని బట్టి ఒక ఇంటికి వచ్చి చేరతారు. మరల ఆ ప్రారబ్ధం అవ్వగానే ఆ ఇల్లు విడిచిపెట్టి వెళ్ళిపోతారు. మీరు ఎంత ఇష్టంగా ఉన్నా మాట మాట అనుకోకుండా రోజులు వెళ్ళవు. ప్రతీ సంసారంలోను ఆ సంసారానికి తగ్గట్లు ఏవో సమస్యలు ఉంటాయి. ఇక్కడ పరమాత్మ చెప్పేది ఏమిటి అంటే మీరందరూ అర్జునుడిలాగ యుద్ధం చేయనక్కరలేదు. యుద్ధానికి వెళ్ళినవారు ఎలా పారిపోరో అలాగ మీరు కూడా మీ కుటుంబంలో వచ్చే సమస్యలను ధైర్యంగా పరిష్కరించుకోవాలి కాని ఇల్లు విడిచిపెట్టి పారిపోవద్దు అంటున్నాడు.

**భోక్తారం యజ్ఞతపసాం సర్వలోక మహేశ్వరమ్**

**సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వామాం శాంతి మృచ్ఛతి। (5-29)**

**భోక్తారం యజ్ఞ తపసాం :-** తపస్సు అంటే మీరు ఇల్లు విడిచిఎక్కడికి పారిపోవటంకాదు. మీరు శరీరంతోటి తపస్సు చెయ్యవచ్చు, మాటతోటి తపస్సు చెయ్యవచ్చు, మనస్సుతోటి తపస్సు చెయ్యవచ్చు. మీరు శరీరంతోటి మంచి పనులు చేసారు అనుకోండి దానికి నేను భోక్తగా

ఉంటాను అన్నాడు పరమాత్మ. మీరు శరీరంతోటి మంచిపనులు చేస్తూ ఉంటే అది శారీరక తపస్సు. మీ మాటకి కూడా శక్తి ఉంటుంది. మీరు మాట్లాడేమాట హృదయంలోంచి వస్తూ ఉంటే దానివలన అనేక మందికి అశాంతి ఆరిపోతుంది అది వాక్కు తపస్సు. మీరు భౌతికంగా ఎవ్వరికీ సహాయం చేయలేకపోయినా వారు సుఖంగా ఉండాలి, క్షేమంగా ఉండాలి అని వారి శ్రేయస్సు మీరు కోరుకోవాలి అది మానసిక తపస్సు. కర్మ అంటే పని. మనం పని మూడు రకాలుగా చేసుకోవాలి 1. మీరు సంసారంలో ఉన్నారు కాబట్టి సంసారానికి ఉపయోగపడే పని చేసుకోవాలి. 2. మనం సమాజానికి ఉపయోగపడే పని చెయ్యాలి. 3. మోక్షం సంపాదించటానికి మీరు చేసే సాధన. ఇవన్నీ కూడా కర్మలోకే వస్తాయి. మీరు ఏ కర్మ చేస్తే దుఃఖం వస్తుందో, అశాంతి వస్తుందో, మీరు ఏ కర్మ చేస్తే పాడులోకాలకు వెడతారో ఆ పనులు చెయ్యవద్దు అని పరమాత్మ చెప్పాడు. దానిని నిషిద్ధకర్మ అన్నారు. అందుచేత మనం సత్‌కర్మ చేసినా, చెయ్యకపోయినా మనం చెయ్యకూడని పనులకు మనం వెళ్ళకూడదు. నిగ్రహం నేర్చుకోవాలి. మాటలో నిగ్రహం ఉండాలి, మనస్సులో నిగ్రహం ఉండాలి. మీరు చేసే పనిలో కూడా నిగ్రహం ఉండాలి. మీకు ఇతరులకి అపకారం చేసే శక్తి ఉన్నా మీరు అపకారం చెయ్యకూడదు. ఎందుచేతనంటే అది పనికిరాదు అని పరమాత్మ చెప్పాడు. ఇది గుర్తుపెట్టుకోండి. నీ జీవితగమ్యం అలౌకికశాంతిని పొందటం, నువ్వు ఆత్మజ్ఞానాన్ని సంపాదించాలి. ఆత్మజ్ఞానసంపాదనకి అనుగుణంగా నీమాట, నీచేత ఉండాలి. అంతేకాని ఆవేశంతోటి మాట్లాడటం వలన ఏమీ ప్రయోజనం ఉండదు. నువ్వు ఒక మంచి మాట మాట్లాడితే, చేత్తోటి ఒక మంచి పని చేస్తే, నువ్వు ఎదుటివాళ్ళకి ఉపకారం చెయ్యలేక పోయినా వాళ్ళ క్షేమం కనుక నువ్వు కోరితే అందులో నేను వాటా తీసుకొని నీకు ప్రతిఫలం ఇచ్చే బాధ్యత నాది అర్జునా అన్నాడు పరమాత్మ. నువ్వు ఏ పని చేసినా సహృదయంతోటి చెయ్యి, సద్బుద్ధితోటి చెయ్యి అది యజ్ఞంతోటి సమానం. మీకు అర్థం అయినా, అర్థం కాకపోయినా ఈ కనిపిస్తున్న లోకమేకాదు అన్ని లోకాలకి అధిపతిని నేనే, దేవతలకు కూడా అధిపతిని నేనే. అందుచేత నువ్వు ఎవరికైతే మంచి చేసావో వారు గుర్తించకపోయినా నేను గుర్తించి నిన్ను మోక్షసామ్రాజ్యానికి, శాంతిసామ్రాజ్యానికి అధిపతిని చేస్తాను. భగవంతుడు మనలో అంతర్యామిగా ఉన్నాడు, ఆయనకు అసాధ్యమంటూ ఏమీ లేదు.

**యానిశా సర్వభూతానాం :-** అజ్ఞానికి ఏది రాత్రో, జ్ఞానికి అది పగలు. అంటే ఆత్మజ్ఞానం ఎలా ఉంటుంది, నోబుల్ తాట్స్ ఎలా ఉంటాయి, సహృదయం, సద్బుద్ధి ఎలా ఉంటుంది అది అజ్ఞానికి తెలియదు. ఒక అజ్ఞాని ప్రక్కన ఒక జ్ఞాని కూర్చున్నా అజ్ఞాని వాడిని చూడలేడు

కాబట్టి అది అజ్ఞానికి రాత్రితోటి సమానం. అలాగే ఒక భోగప్రవృత్తి ఉన్నవాడి దగ్గర ఒక జ్ఞాని కూర్చున్నా జ్ఞానికి ఆ భోగప్రవృత్తి కనబడదు. అజ్ఞాని అనుభవించే భోగప్రవృత్తి జ్ఞానికి రాత్రిలాంటిది. ఆత్మజ్ఞానం అజ్ఞానికి కనబడదు. భోగప్రవృత్తి జ్ఞానికి కనబడదు. నాగ మహాశయుడు చెబుతాడు నరేన్ నీకూడా చాలామంది సన్యాసులు తిరుగుతున్నారు కానీ ఎవరూ నిన్ను అర్థం చేసుకోలేదు. ఒక జ్ఞానికి, ఒక అజ్ఞానికి స్నేహం ఉండవచ్చును కాని జ్ఞాని యొక్క స్థితిని అజ్ఞాని ఎన్నడూ అర్థంచేసుకోలేడు. వాడిలో ఉన్నటువంటి స్వార్థం, అసూయ వాడిలో ఉన్నటువంటి కక్ష ఆ వస్తువుని చూడనివ్వదు. నిన్ను అర్థం చేసుకున్నది రామకృష్ణుడు ఒక్కడే. రామకృష్ణుడు చెప్పినమాటలు సన్యాసులు అర్థం చేసుకొని చెప్పటం లేదు. ఆయన మాటలను చిలకపలుకులు పలుకుతున్నారు అన్నాడు నాగమహాశయుడు.

ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. ఆయనే మనకి యజమాని, మనకి భర్త, మనకి ప్రభువు, మన కర్మ ఫలదాత, మనల్ని అజ్ఞానంలోంచి విడుదల చేయగల సర్వసమర్థుడు, అనుగ్రహించటానికి, దయ చూపటానికి సమర్థుడు అనేటువంటి విశ్వాసం కూడా మనకు లేదు. మనం విశ్వాసహీనులం. మనం దేవుని యొక్క అనుగ్రహం కోసం పని చెయ్యము, లోకం గుర్తింపుకోసం పనిచేస్తున్నాము. అందుచేత ఆ జన్మకాజన్మ లోకానికి, శరీరానికి బంధింపబడిపోతున్నాము కాని చైతన్యము యొక్క సమీపంలోనికి, భగవంతుడి యొక్క సమీపంలోనికి వెళ్ళటం లేదు. మనం నోటితోటి భగవంతుడి సమీపంలోనికి వెళ్ళాలని చెబుతున్నాము కాని దైనందిన జీవితంలో మన చేష్టలన్నీ కూడా లోకానికి సమీపంగా ఉంటున్నాము, దేహానికి సమీపంగా ఉంటున్నాము, రాగద్వేషాలకు సమీపంగా ఉంటున్నాము. గుడిలో దేవుడు ఉన్నాడు అనుకుంటున్నాము కానీ మన హృదయంలో అంతర్యామిగా నారాయణుడు ఉన్నాడు అనే గుర్తింపు మనకు లేదు. ఇతరులమాట వదిలేయండి భక్తులు కూడా అలాగే ఉన్నారు. మనం భక్తులుకింద లోకంలో చెలామణి అవ్వవచ్చు దానివలన ప్రయోజనం లేదు. వీడు మన భక్తుడు అని భగవంతుడు అనుకోవాలి కదా! మనలను అలా అనుకునే అవకాశం లేదు. నువ్వు తల్లి కడుపులోంచి బయటకు వచ్చాక పశువుని కర్ర పుచ్చుకొని ఎలా తోలుకు వెళతారో అలాగ నీ దేహం యొక్క కర్మానుసారం అంతర్యామిగా ఉన్న నారాయణుడు నిన్ను వల్లకాటిలో ఉన్న గోతిలోకి తోలుకువెళుతూ ఉంటాడు. నారాయణుడుని కాదని నువ్వేమీ చెయ్యలేవు. మీకు అనేక ఊహలు, అనేక సంకల్పాలు ఉండవచ్చు కానీ ఈశ్వరుడికి కూడా ఒక ప్రణాళిక ఉంటుంది. ఈశ్వరుడి యొక్క ప్రణాళికని బట్టే మీ దేహాలని తోలుకు వెళుతూ ఉంటాడు. ఆ గోతిలోకి వెళ్ళేవరకూ మీ శరీరాల్ని డ్రైవ్

చేస్తూ ఉంటాడు. ఈశ్వరుడు మీ కళ్లకు కనబడడు, మీ చెవులకి వినపడడు, పశువుల్ని తోలుకువెళ్లినట్లు మిమ్మల్ని తోలుకు వెళతా ఉంటాడు. ఈ పశువులకి పతి శివుడు అందుకే శివుడికి పశుపతి అని పేరు. ఆత్మబుద్ధి లేకుండా దేహబుద్ధి ఉన్న ప్రతీవాడు పశువే అన్నారు.

సుహృదం సర్వభూతానాం :- ఈ సృష్టిలో నాకంటే నీ క్షేమం కోరేవాళ్ళు ఎవరయినా ఉన్నారా అర్జునా! నీ క్షేమం నేను కోరుతున్నాను కాబట్టే మీ కళ్లకు అందని విషయాలు, మీ చెవులకి అందని విషయాలు, మీ మనస్సుకి అందని విషయాలు, మీ బుద్ధితోటి పట్టుకోలేని విషయాలు నేను మీకు శాస్త్రరూపంలో చెబుతున్నాను. శాస్త్రం ఎందుకు? పరమాత్మలోకి మీ కళ్ళు తెరిపించటానికి శాస్త్రం అవసరం. అందుచేత ఈ శాస్త్రం మీకు చెబుతున్నాను. భగవంతుడు లేడని చెప్పేవాళ్ళు అనేకమంది ఉండవచ్చును కాని వాళ్ల యోగక్షేమాలు కోరడం నేను మానను. భగవంతుడు అంటే ఇట్టి వాడు అని భగవంతుడు గురించి మీకు ఒక అవగాహన లేదు. భగవంతుడు ఎంతశక్తిమంతుడో, ఎంత అనుగ్రహస్వరూపుడో, మీకు తెలియటంలేదు. ఆయన దయ ఉంటే మీ పునర్జన్మలకి ఏ వాసనలు అయితే కారణాలో ఆ వాసనలలో నుండి కొన్ని క్షణాలలో మిమ్మల్ని విడుదల చేయగలిగినటువంటి సర్వసమర్థుడు వాడే నారాయణుడు. ఈ సృష్టి అంతా ఆయన సంకల్పానుసారమే నడుస్తోంది అని తెలియక పోవటం వలన మీకు అశాంతి వస్తోంది. నేను చెప్పిన సబ్జక్టు మీకు అర్థమవుతూ ఉంటే ఉన్నది శాంతే.

భగవంతుడి మీద నమ్మకం కలగాలన్నా, భగవంతుడి వాక్యములయందు విశ్వాసము కలగాలన్నా, సత్పురుషులతోటి సహవాసము చేయాలన్నా, భగవంతుడి వాక్యము మనకి అర్థం కావాలన్నా నాలుగు మంచి గుణాలు ఉండాలి. 1. చిత్తశుద్ధి, 2. చిత్త ఏకాగ్రత, 3. వివేకము, 4. వైరాగ్యము. ఈ నాలుగు లక్షణాలు మీకు ఉంటే మంచిదే, లేకపోతే ఈ గుణాలు మీరు సంపాదించుకోండి. మేము మీ క్షేమం కోరకుండా, మీ శాంతి కోరకుండా, కొంచెం కూడా చిత్తశుద్ధి లేకుండా మేము ఇక్కడ గంటలతరబడి ప్రవచనాలు చెప్పినా టైము అంతా వేస్టు. చిత్తశుద్ధి లేనివాడికి శ్రవణం ఏమిటి? చదువుకొని అభివృద్ధిలోనికి రావాలని చాలామందికి ఉంటుంది కాని వాళ్లకి ఏకాగ్రత లోపిస్తే చదువురాదు. ఏకాగ్రత లేనప్పడు మనస్సు చదువుమీద నిలబడదు. అందుచేత భగవంతుడు చెప్పిన మాటలమీద మీకు విశ్వాసం కలగాలన్నా చిత్తశుద్ధి ఉండాలి. చిత్తఏకాగ్రత ఉండాలి. వివేకము అంటే మనం ఏది చదివినా, ఏది విన్నా ప్రతీ విషయం కూడా మనం సొంతంగా ఆలోచించుకోవాలి. అందులో ఏదిమంచి, ఏది చెడు అని మనకు తెలియాలి. వైరాగ్యం లేకపోతే మీ మనస్సు అంతర్ముఖం అవ్వదు. వైరాగ్యం కూడా సంపదతోటి సమానం. వైరాగ్యానికి ప్రతిరూపమే

రామకృష్ణుడు. రామకృష్ణ పరమహంసగారికి చదువులేకపోయినా ఆయన మాట్లాడే మాటలో ఎక్కడా కపటం కనపడదు. లౌక్యం ఎలా ఉంటుందో ఆయనకు తెలియదు. ఆ రెండింటి వల్లే నేను ఆయనకు ఆకర్షింపబడ్డాను. నువ్వు ఏదైనా చెడ్డమార్గంలో ఉంటే ఆ చెడ్డ మార్గంలోంచి నిన్ను ఎలా విడుదల చెయ్యాలి అని చూచుకునేవాడు కాని ఎప్పుడూ నిన్ను విమర్శించేవాడు కాదు పైగా నిన్ను దగ్గరకు చేరదీసేవాడు. మీకు అందరికీ తల్లిదండ్రులు ఉన్నారు మీ చెడ్డ ఆలోచనలోంచి, మీ చెడ్డ బుద్ధిలోంచి మిమ్మల్ని బయటకు తీసుకురావటం కోసం ఏ తల్లితండ్రులు అయినా కృషి చేస్తారా? మన దురాలోచనలోంచి, మన దుర్బుద్ధిలోంచి విడుదల చేసేవాడు మనకి చుట్టము అంతే కాని ఊరికే లౌకికమైన మాటలు చెప్పేవాడు మనకి చుట్టము కాదు.

మనతో ఎవరైనా ఏదైనా మాట్లాడుతున్నారనుకోండి ఆ మాట ప్రేమతో మాట్లాడు తున్నారా, వాళ్ళు అసూయతోటి మాట్లాడుతున్నారా అని మనం చూచుకోవాలి. వాడు అసూయతో మాట్లాడుతున్నాడు అని నీకు అర్థమవుతున్నా ఆ అసూయను నువ్వు గుర్తించ కూడదు. తెలియనట్లే నటించి మామూలుగా నువ్వు వాళ్ళని ప్రేమించటం నేర్చుకోవాలి. దానిని టేక్ట్ అంటారు. అప్పుడు నువ్వు ప్రమాదంలో పడకుండా ఉంటావు. ఎవరు ఎలా ఉన్నా మనం కామ్‌గా, క్వయిట్‌గా ఉండి మనం అందరిలోని మంచినే తీసుకోవాలి కాని చెడ్డతీసుకోకూడదు. అందుకే రామకృష్ణుడిని పరమహంస అన్నారు. మీరు పాలు, నీళ్ళు కలిపి ఒక గ్లాసులో పెడితే హంస ఏమి చేస్తుంది అంటే పాలు తాగి నీళ్ళు వదిలేస్తుంది అలాగే రామకృష్ణుడు మంచిని తీసుకొని చెడ్డ వదిలేసేవారు. వివేకం అంటే విడదీసుకునే బుద్ధి. ఈశ్వరసంకల్పాన్ని బట్టే సృష్టి అంతా నడుస్తోంది. అది నీకు అర్థం అయితే నీకు దుఃఖంతోటి, అశాంతితోటి పనేముంది. నీకు ఎలాగైతే ప్రణాళికలు ఉన్నాయో అలాగే ఈశ్వరుడికి కూడా ఒక ప్రణాళిక ఉంది. ఈశ్వరుడి సంకల్పంతోటి మన సంకల్పం ఐక్యమైతే కాని మనం దుఃఖంలోంచి బయటకు రాలేము, అశాంతి లోంచి బయటకు రాలేము.

ఎవరింటికి వెళ్ళినా మాకు శాంతిలేదు, మాకు శాంతి లేదు అంటున్నారు. శాంతి రావటం అంత తేలిక కాదు. శాంతిని ఎవరు పొందుతారు అంటే ఒక్క బ్రాహ్మీస్థితిని పొందిన వాడే శాంతిని అనుభవించగలడు. ఒక్క బ్రహ్మజ్ఞాని మాత్రమే శాంతిని అందించగలడు. మీరు కాఫీ కప్పులో పోస్తూ ఉంటే ఆ కప్పు నిండాక కాఫీ కిందకు కారిపోతూ ఉంటుంది. అలాగే బ్రాహ్మీస్థితి పొందినవాడి యొక్క హృదయం అంతా శాంతితో నిండిపోయి తరువాత శాంతి కిందకు కారిపోతూ ఉంటుంది. ఆ కారిపోయే శాంతినే జ్ఞాని మీకు పంచిపెడుతూ

ఉంటాడు. త్యాగరాజు రాముడి మీద కీర్తనలు చెప్పాడు అయితే అది మార్కెట్ సంగీతం కాదు రాముడు ఆయనకు ఇచ్చిన ఆనందాన్ని అనుభవించి, అనుభవించి ఆ ఆనందాన్ని కక్కాడు. ఆ కక్కిన ఆనందమే సంగీత రూపంలో వచ్చింది అది త్యాగరాజు కీర్తనలు. మనకు ఏదైనా శాంతి ఉంటే ఇతరులకు పంచిపెట్టగలం కాని మనకే శాంతి లేనప్పుడు ఇతరులకు ఎలా పంచి పెట్టగలం. ప్రపంచంలో పాపం అంటూ ఏదైనా ఉంటే ఒకటే ఉంది అది ఎటాచ్‌మెంట్. ఎటాచ్‌మెంట్ ఈజ్ సిన్ అని భగవాన్ చెప్పారు. నీకు ఎటాచ్‌మెంట్ లేకపోతే అసలు దుఃఖ స్పర్శ లేకుండా నువ్వు స్మశానానికి వెళ్ళిపోతావు. మనం పని చెయ్యటం నేర్చుకోవాలి కాని బంధింపబడకూడదు. ప్రతీ దేహానికి ప్రారబ్దం ఉంటుంది. ప్రారబ్దం లేకుండా అసలు దేహం రాదు. ఆ ప్రారబ్దాన్ని బట్టి దేహం నడుస్తూ ఉంటుంది. మన డ్యూటీ మనం చెయ్యాలి. మరి దేహాన్ని గోతిలో పెట్టే వరకు ఆ దేహం ప్రారబ్దాన్ని బట్టి వెళ్ళిపోతూ ఉంటే ఇంక మనం చేసేపని ఏముంటుంది అని ఒకరు భగవాన్‌ని అడిగారు. దేహం ప్రారబ్దాన్ని బట్టి పోతూ ఉన్నా దేహంతో తాదాత్మ్యం లేకుండా జీవించటం అవసరం, నీ దేహ ప్రారబ్దం అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా, పాప ప్రారబ్దమే నిన్ను వెంటాడుతుంది అనుకో ఈలోపు దేహము నేను కాదు అనే బుద్ధి నీకు కలిగితే శవబుద్ధి పోయి ఆత్మబుద్ధి నీకు కలిగితే ప్రపంచంలో ఎవరికీ లేని దుఃఖం నీకు వచ్చినా అది నిన్ను ముట్టుకోదు అని భగవాన్ చెప్పారు. ఈ ఆత్మజ్ఞానం ఎటువంటిది అంటే జ్ఞానిని చూచి దేవతలకి కూడా అసూయ కలుగుతుంది. అట్టిది జ్ఞానం యొక్క వైభవం. ఏ వస్తువుకైతే పుట్టుకలేదో, ఏ వస్తువుకైతే చావులేదో, దేని స్వరూపమైతే సత్యమో, శాంతమో, ఆనందమో ఆ సద్వస్తువుతోటి నీకు తాదాత్మ్యం వచ్చినప్పుడు నీ దేహం, నీ మనస్సు ఎంత చెడ్డ ప్రారబ్దం అనుభవిస్తున్నప్పటికీ నీకు ఎర్రచీమ కుట్టినట్టు కూడా ఉండదు. నేను ప్రారబ్దం అనుభవిస్తున్నాను అనే స్పృహ కూడా నీకు కలగదు అట్టిది అమృతానుభవం. అది ఆత్మజ్ఞానం. ఏదో మీకు ఇష్టమైన వస్తువు తినటం వలన, భోగాలు అనుభవించినప్పుడు వచ్చే శాంతి లాంటిది కాదు అది. అది అలౌకిక శాంతి, అభౌతికశాంతి. మిమ్మల్ని చూచి దేవతలు కూడా అసూయ పడే శాంతి, జ్ఞానము లేనివాడికి శాంతి ఎక్కడ ఉంది.

**నిస్పృహ :-** చాలామంది మేము కష్టాలు పడుతున్నాము, చాలా బాధలు పడుతున్నాము అని చెబుతారు. బ్రహ్మజ్ఞానికి కష్టం వచ్చినా నేను కష్టాలు అనుభవిస్తున్నాను అనే స్పృహ ఉండదు. అందరికీ దేహం అంటే ఎక్కువ ఇష్టం. కామం అంటే కోరిక. కామవాసనలు దేహంలో ఉంటాయి కాబట్టి, ఆ దేహంలో ఉన్నప్పుడు ఆ కామవాసన నెరవేర్చుకోవచ్చు కాబట్టి

దేహం అంటే ఇష్టపడతారు. దేహంలేకపోతే కామవాసనలు ఎలా నెరవేరతాయి, దేహం ఉంటే కామవాసనలు నెరవేరతాయి. అయితే కామవాసనలు నెరవేర్చుకున్నంతకాలం అహంకారం, మమకారం మనల్ని విడిచిపెట్టి వెళ్ళదు అన్న సంగతి మనకు తెలియదు. నిస్పృహ అంటే నీకు శరీరం ఉందనే ధ్యాసకూడా నీకు ఉండదు. యాంత్రికంగా స్నానం చేస్తావు, యాంత్రికంగా ఆ టైముకి కొంత తింటూ ఉంటావు అంతేకాని నేను దేహాన్ని అని నువ్వు అనుకోవు. నాకో దేహం ఉంది అనుకుంటావు అంతే అందుచేత దేహం పట్ల స్పృహలేని వాడు శాంతిని పొందుతాడు. మహాజ్ఞానికి వాడి దేహాన్ని చెడ్డ ప్రారబ్దం వెంటాడుతున్నా, మంచి ప్రారబ్ధం వెంటాడుతున్నా వాడు చలనం లేకుండా వాడు ఏ స్థాయిలో ఉండాలో ఆ స్థాయిలో ఉంటాడు కాని వాడు ప్రారబ్ధానికి అటూ ఇటూ కొట్టుకుపోడు. వాడు సముద్రంతోటి సమానం.

**ఆపూర్యమాణ మచల ప్రతిష్టం :-** సముద్రం జలంచేత నింపబడి ఉంటుంది. వర్షాకాలం నదులు పొంగిపోయి వచ్చి సముద్రంలో పడుతున్నప్పటికీ దానికేమీ ఉద్రేకం లేదు, వికారం లేదు. వేసవికాలంలో నదులు ఎండిపోయి ఒక్క నది కూడా సముద్రంలోకి వెళ్ళకుండా ఆగిపోయినా అప్పుడూ దానికి ఏ వికారము లేదు. నువ్వు సముద్రంలాగ ఉండు. మీ ప్రారబ్దం బావుంది అనుకోండి, మీరు అనుకున్న పనులు అన్నీ అయిపోతున్నాయి అనుకోండి అప్పుడు మీకు సంతోషం వస్తోంది అనుకోండి అది సంతోషం కాదు. అది ఒకరకమైన వికారం. కాల ప్రవాహంలో ఏదో ఒక రోజున ఈ సంతోషం అంతా దుఃఖంగా మారిపోతుంది. బైబిల్‌లో ఏమని చెబుతాడు అంటే ఈ అల్లరి మాటలు అన్నీ నీకు ఎందుకు? నువ్వు బ్రాహ్మీస్థితిని పొందటానికి ప్రయత్నం చెయ్యి. స్వర్గరాజ్యం ఎక్కడో లేదు నీ హృదయంలోనే స్వర్గరాజ్యం ఉంది. ఆ స్వర్గరాజ్యాన్ని నువ్వు పొందటానికి ప్రయత్నం చెయ్యి. ఆ స్వర్గరాజ్యంలో నువ్వు ప్రవేశిస్తే నీకు నాలుగు ఓడలకు సరిపడే దుఃఖం నీలో ఉన్నప్పటికీ ఆ దుఃఖం అంతా సుఖంగా మారిపోతుంది. స్వర్గరాజ్యం యొక్క వైభవం అటువంటిది అన్నాడు ఏసు. మీకు ఎప్పుడైనా సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా అది నిజం అనుకోకండి అదొక వికారం మాత్రమే. సముద్రం నీరుచేత నింపబడి ఉంటుంది, అలాగే నువ్వు శాంతితోటి, జ్ఞానంతోటి సముద్రంలాగ నింపబడి ఉన్నప్పుడు నీ ప్రారబ్దం చెడ్డగా ఉంటే ఏముంది? మంచిగా ఉంటే ఏముంది? అవన్నీ ద్వైతం గొడవలు. జనక మహారాజు మహాజ్ఞాని. అనేక భోగాలు వచ్చి ఆయన నెత్తి మీద పడ్డాయి. ఈ భోగాల వల్ల ఆయనకు ఏమీ సంతోషం రాలేదు. కామం కావాలనుకున్న వాడికి భోగం వచ్చినప్పుడు సంతోషం వస్తుంది కాని కామప్రవృత్తి లేనివాడికి భోగాలు వచ్చి

నెత్తిమీద పడుతున్నప్పటికీ, ఒకవేళ భోగాలు లేనప్పటికీ ఈ భోగాలతోటి సంబంధం లేకుండా సుఖంగా, శాంతిగా ఉంటాడు. జ్ఞాని యొక్క ఔన్నత్యాన్ని భగవంతుడు చెబుతున్నాడు. జ్ఞాని సముద్రంలాంటివాడు. చలనం లేనివాడు, అచలుడు. సముద్రం నదులచేత చుట్టబడి ఉంటుంది. వాల్మీకి అన్నాడు రాముడు సత్‌పురుషులచేత చుట్టబడి ఉంటాడు, రాముడికి ఎటుచూచినా సత్‌పురుషులే ఉంటారు. ఏ వైపు చూచినా పవిత్రమైన ఆలోచనలే, కాని చెడుతలంపులు వచ్చే అవకాశం లేదు అన్నాడు.

నేను, నాది అనే తలంపులు ఎక్కడ ఉన్నాయి? నేను అనే తలంపు అన్ని తలంపుల్లోకీ బాగా అట్టడుగున ఉన్న తలంపు. ఆ నేను అనే తలంపు పోతే మిగతా తలంపులకి ఆధారం పోతుంది. ఆధారం పోయాక మిగిలిన తలంపులు కూడా పోతాయి. ఈ నేను అనే తలంపు నీకు లోపలనుంచే వస్తోంది. శాంతిసముద్రం, జ్ఞానసముద్రం నీ హృదయంలో ఎక్కడ ఉందో అక్కడ నుంచే ఈ నేను అనే తలంపు నీకు ఒక బుడగకింద వస్తోంది. ఈ నేను అనే తలంపుని నువ్వు లోపలికి పంపగలిగితే తన మూలంలోకి వెళ్ళేటప్పటికి అక్కడ ఉన్న శాంతి సముద్రంలో ఈ నేను కలిసిపోతుంది. ఈ నేను పోతే నువ్వు పోతావేమో అని నీకు భయం వేస్తోంది. నీకు భయం వద్దు. నువ్వేమీ పోవు. నువ్వు శాంతిసముద్రం అవుతావు. అప్పుడు నువ్వు శాంతిసామ్రాజ్యానికి అధిపతివి అవుతావు.

అందరికీ దేహం అంటే ఇష్టం. దానికి కారణం భోగవాసన. కానీ మనిషి అనుభవించే ప్రతీ భోగం కూడా రాబోయే జన్మలో రోగాల కింద మారిపోతాయి. నువ్వు ధ్యానం చేస్తే మనస్సుతోటి చేస్తున్నావు, జపం చేస్తే మనస్సుతోటి చేస్తున్నావు, విచారణ చేస్తే మనస్సుతోటి చేస్తున్నావు. ఈ జప, ధ్యానములు, విచారణలు, యజ్ఞతపస్సులు దేనితోటి చేస్తున్నావో ఆ మనస్సు ఉంది అనుకుంటున్నావు. అసలు అది ఉందా, లేదా అని నిజంగా నువ్వు విచారణ ప్రారంభిస్తే లేనిది లేకుండా పోతుంది. ఇదే జ్ఞానమార్గము, ఇదే విచారణామార్గము, ఇదే రమణమార్గము. కొన్ని గడ్డిపరకలు కలిపితే గడ్డితాడు అవుతుంది. అలాగే నీకు ఉన్న వాసనల సమూహమే మనస్సుకింద పేరుకున్నట్టు అనిపిస్తుంది. ఆ మనస్సుని విచారణ చేస్తే చైతన్యంలో కలిసిపోతుంది. అప్పుడు నువ్వు సముద్రంతోటి సమానం అయిపోతావు. నువ్వు ఏ వస్తువు కోసమైతే అన్వేషణ చేస్తున్నావో అది నీ హృదయంలో ఉంది అని తెలియక ఎక్కడో ఉందనుకొని ఎక్కడికో తిరుగుతున్నావు నువ్వు. ఈ గారడీ అంతా నీ మనస్సు చేస్తోంది. ఆ మనస్సు నశించే వరకూ నీకీ వాండరింగ్ తప్పదు. నువ్వు నో మైండ్ స్టేట్‌కి వెళ్ళాలి. దానికి గురువులనుగ్రహం అవసరం.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| మే | 9 | గుండుగొలను |
| మే | 31 | శివరావుపేట, రాజుల వీధి, భీమవరం |
| జూన్ | 12 | శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha

# శంకరం - శంకరాచార్యం

**(ది॥ 08-05-2011 శ్రీ శంకర జయంతిని పురస్కరించుకొని)**

ఆర్యాంబ, శివగురువు పుణ్యదంపతులకు ఈశ్వర వరప్రసాదంగా కాలడిలో జన్మించి, క్రీ॥శ॥ 788-820 మధ్యకాలంలో జీవించిన శ్రీ ఆదిశంకరాచార్యులు, సాక్షాత్తు భూమిపైకి దిగివచ్చిన పరమశివుడే! అద్వైతసిద్ధాంతానికి మూలస్థంభముగా శ్రీ శంకరులను పేర్కొన వచ్చును. అట్టి శంకరులకు గురువు గోవింద భగవత్పాదులు. శ్రీ శంకరులు కేవలం 32 సంవత్సరములు మాత్రమే భూమిపై సంచరించినా ఆయన మానవాళికి అందించిన జ్ఞానగని అద్భుతం, అపూర్వం. జీవకోటిని ఉద్ధరించడానికై శ్రీశంకరులు అనేక భాష్యగ్రంథాలు, ప్రకరణ గ్రంథాలు, స్తోత్రగ్రంథాలు రచించి వాటిలో గురువు యొక్క ఆవశ్యకతను గురించి, బ్రహ్మము యొక్క నిజతత్త్వము గురించి, దృశ్యప్రపంచము మరియు జీవుని యొక్క మిథ్యాతత్వము గురించి, ఆత్మతత్త్వమును అనుభవైకవేద్యము చేసుకొనుటకు అవసరమగు సాధన సంపత్తి గురించి, సవివరంగా చెప్పిరి. మనుష్య జన్మ, మోక్షమందలి ప్రగాఢమైన కోరిక, సత్పురుషుల ఆశ్రయము, కేవలం దైవానుగ్రహం వల్లనే కలుగునని, అట్టి దుర్లభమైన మానవ దేహమును పొందియు వాస్తవముగా తానెవరో? తెలిసికొనకపోవుట ఆత్మహత్యా సమానమని చెప్పిరి. బంధకారకములైన అహంకార, మమకారములను విడిచిపెట్టి గురువుచే ఉపదేశింపబడిన మార్గమున పయనించి శ్రవణ, మనన, నిధి ధ్యాసల ద్వారా కల్పిత బంధ విముక్తికొరకు ప్రయత్నించాలి. నాటికి, నేటికి పరమ పూజ్యునిగా జగద్గురువుగా మానవాళిచే పూజలందుకొంటున్న మహనీయుడు శ్రీ ఆదిశంకరులు.

**- చావలి సూర్యనారాయణ మూర్తి, టీచర్, అమలాపురం**

# చూచేవాణ్ణి తీసేస్తే - చూడబడేది ఏమీ లేదు

ఈ సృష్టిలో విషయాలు లేకుండా చేయలేము కాబట్టి విషయాల గురించి జాగ్రత్త తీసుకొంటే సరిపోతుంది. విషయాలు అనంతంగా ఉన్నా వాటిని నిగ్రహించి స్పందించే మనస్సు మన ఆధీనంలోనే ఉంది కాబట్టి దాన్ని శాంతంగా ఉంచితే అమృతంగా ఉంటుంది. అలజడులను రేపే విషయాలను విషతుల్యంగా భావించాలి. అప్పుడు మనస్సు లొంగదీసుకోవటం సులభసాధ్యమౌతుంది. చైతన్య జ్యోతి వెలుగులోనే విషయాలు కనబడుతున్నాయి. మనస్సుకు చైతన్యానికీ ఉన్న సంబంధం చిత్రాతి చిత్రమైన సంబంధం. మనలను మనం సాక్షిగా చూచుకోవాలి. వాటిపై సరియైన అవగాహన ఉండి తీరాలి. ఇది లేకపోతే ధ్యానం వైపు మనస్సు మరలదు. మనలోనే మన వల్లనే ఈ ప్రపంచం ఉనికి సంతరించుకొంది. అది మనలను ఏ విధంగానూ బంధించదు. పరిమితం చెయ్యదు. అనేకత్వం భ్రాంతిని కలుగజేస్తూ అనిర్వచనీయమైన జగన్నాటకాన్ని ప్రదర్శించే ఈ మనస్సును ఆపకపోతే దానికూడా మనం పరుగెత్తిపోవటం అతి తేలిక. సరదాకైనా ఆటకైనా ఇంద్రియ గోచరమైన ప్రపంచాన్ని సత్యంగా ఒక్క క్షణం భావించినా పతనం తప్పదు. మనస్సు చేసే తుంటరిచేష్టలకు నిరశించకూడదు, నిరాసక్తిగా, సాక్షిగా దృశ్యాన్ని చూచి, చూస్తున్న దాన్ని అర్థం చేసుకోవాలి. చూస్తూ ఉండే నేను హీనస్థితే ముక్తి అంటారు పెద్దలు నేను చూస్తున్నాను అనుకోవటమే బంధం. “ఆయా వస్తువుల బాహ్య స్వరూపాన్ని దాటి వాని సత్య స్వరూపాన్ని గ్రహించటమే” వేదాంతం యొక్క బోధ. మనస్సులో భేదబుద్ధి ఉన్నంతకాలం కామ-క్రోధాలు ఏర్పడతాయి. చూచేది చూడబడేది ఒకటైనప్పడు అది అనుభవానికి వచ్చినప్పడు ఈ కోపతాపాలకు, విషాదాలకు హేతువు ఉండదు. అహంకారం చచ్చిపోతే అన్ని కష్టాలు చచ్చిపోతాయి. చెట్టునుంచి పచ్చికాయ కోస్తే నీరు కారుతుంది. పండైతే ఏదీ రాదు. అలాగే జ్ఞానం కలిగినప్పడు బంధాలన్నీ అతి సునాయాసంగా అప్రయత్నంగా విడిపోతాయి. శ్రీనాన్నగారు “మనస్సు అనే కిటికీలోంచి చూస్తే అనేకమైన ఊరించే విషయ సముదాయాలు ఉంటాయి. ఆత్మ అనే కిటికీలోంచి చూస్తే అంతా శాంతే, అంతా ఆనందమే” అన్నారు. ఈ సిద్ధాంతాన్ని నిరంతరం మనలో పాదుకొనేలా చేసుకోవాలి. మన మనస్సులో బండరాళ్ళు మన స్వప్రయత్నంతో తొలగించుకోలేము. గురుదేవుల పాదపీఠంపై ఆర్తితో దృష్టిని నిలిపి వీటిని తొలగించమని కన్నీటితో వేడుకోవటంతో జీవితం సాఫల్యమౌతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే మనస్సు ద్వారా చూస్తున్నాము కాబట్టి ప్రపంచం కనిపిస్తున్నది. దాన్ని అధిగమిస్తే సుషుప్తిలో వలె ప్రపంచం అదృశ్యమౌతుంది. దుఃఖాన్ని తటస్త భావనతో గమనిస్తే మూల కారణాన్ని చేరుకొంటాము.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**